
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



రాజన్న సిరిసిల్ల
5★★★ జిల్లా వార్తలు
ఆదివారం 6 ఏప్రిల్ 2025

'రాజన్న' క్షేత్రంలో నవమి శోభ..

- శ్రీసీతారాముల కల్యాణ సంబురాలు
- జిల్లా వ్యాప్తంగా దేవాలయాల్లో కల్యాణాలకు ఏర్పాట్లు

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

వేములవాడ రాజన్న క్షేత్రం శ్రీరామనవమి శోభను సంతరించుకుంది. స్వాగత తోరణాలు, చలువ పందిళ్లు, దేదీప్యమానంగా ప్రకాశించే విద్యుత్ దీపాల మధ్య ఆదివారం శ్రీసీతారాముల కల్యాణ వేడుకలను ఘనంగా నిర్వహించడానికి వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానం అధికారులు ఘనంగా ఏర్పాట్లుచేశారు. దేవస్థానంలో శ్రీరామ నవరాత్రి ఉత్సవాలు గతనెల 30న ఘనంగా ప్రారంభించారు. ప్రతిరోజు ప్రత్యేక పూజా కార్యక్రమాలు కొనసాగుతుండగా ఆదివారం ఉదయం 11.55నిమిషాలకు శ్రీసీతా రామచంద్రస్వామి వారల దివ్య కల్యాణోత్సవం నిర్వహించడానికి ఏర్పాట్లుచేశారు. సాయంత్రం రథోత్సవం, డోలోత్సవం ఘనంగా నిర్వహించనున్నారు. కల్యాణోత్సవానికి విశాలమైన వేదికను ఏర్పాటు చేశారు. భక్తులు కల్యాణం వీక్షించే విధంగా ఎల్ఈడీ స్క్రీన్‌లు ఏర్పాటుచేశారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా సర్వం సిద్ధంచేశారు. మరోవైపు శ్రీరామనవమి సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వివిధ దేవాలయాల్లో శ్రీసీతారాముల కల్యాణ వేడుకలు వైభవంగా నిర్వహించుకోవడానికి ఏర్పాట్లు చేశారు. సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని రామాలయం, విశ్వనాథ స్వామి ఆలయం, సాయిబాబా ఆలయం, హను మాన్ దేవాలయాలతోపాటు ఇల్లంతకుంట రామాలయం, కోనరావుపేట మండలంలోని మామిడిపల్లి సీతారామాలయం, ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట, ముస్తాబాద్, వీర్నపల్లి, తంగళ్లపల్లి, బోయినపల్లి, చందుర్తి, రుద్రంగి, కోనరావుపేట మం డలాల్లోని హనుమాన్ దేవాలయాలతో పాటు శ్రీవేంకటేశ్వరస్వామి, ఇతర దేవాలయాల్లో శ్రీసీతారాముల కల్యాణాలు జరపడానికి ఏర్పాట్లు ఘనంగా చేశారు.

కల్యాణ వైభోగమే..

- రామయ్య తలంబ్రాలు.. శివుడిని పెళ్లాడే శివపార్వతులు..
- రాజన్న క్షేత్రానికి 'ధారణ'కు తరలివచ్చిన శివపార్వతులు
- నేడు వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానంలో సీతారాముల కల్యాణం





వేములవాడ దేవస్థానం ఎదుట శివపార్వతులు(ఫైల్)

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

వైభవోపేతంగా జరిపే వివాహ మహోత్సవాలంటే ఇప్పటికీ ప్రపంచంలో ఎక్కడైనా ప్రజలు మక్కువ చూపుతారు. అందులో ధర్మబద్ధంగా నడుచుకోవడం ద్వారా స్త్రీ, పురుషులు తమ వైవాహిక జీవితాన్ని ఎలా అనుభవించాలో శ్రీరాముడే స్వయంగా ఆచరించి చూపించాడు. బలము, యశస్సు, సంపద, జ్ఞానము, సౌందర్యం, వైరాగ్యం వంటి గుణాలతో సంపూర్ణత కలిగిన సీతారాముల కల్యాణం చూడడానికి ఎక్కడికైనా తరలివెళ్తారు. కానీ సీతారాముల తలంబ్రాల వేళ.. ధర్మ ప్రచారకులుగా ఉన్న శివపార్వతులు శివుడే పెనిమిటిగా తమ వివాహాలను పునరుద్ధరించుకునే వేడుక కూడా చూడాల్సిందే. ఆదివారం వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి దేవస్థానం సన్నిధిలో త్రిశూలం గంటల మోత.. వర్షపు జల్లుగా కురిసే తలంబ్రాలు శివసత్తుల పూనకాలతో దద్దరిల్లిపోయే ఆసన్నివేశాలు మహా అద్భుతాలుగానే చెప్పుకోవచ్చు. ఈ పెళ్లి తంతును జంగాలుగా పరిగణించే వీరశైవులు నిర్వహిస్తారు. రుద్రాక్షే మంగళసూత్రంగా కాళ్లకు రాగి మట్టెలు, చేతికి త్రిశూలాన్ని ఇచ్చి పెళ్లి తంతు జరిపిస్తారు.

● ఆగని ధారణ..

లోకజ్ఞానం తెలియని ఆడ పిల్లలను సైతం శివ పార్వతులుగా శివుడితో పెళ్లి చేసే తంతు వేములవాడ వేదికగా 'ధారణ' పేరుతో సాగిపోతునే ఉంది. స్వచ్ఛంద సంస్థలు, పోలీస్ యంత్రాంగం కూడా చిన్నారులకు పెళ్లి తంతు నిర్వహించవద్దని కౌన్సెలింగ్ చేసినా ఆచారం మాత్రం కొనసాగుతూనే ఉంది. రాజన్న సిరిసిల్ల జిల్లా, జగిత్యాల, పెద్దపల్లి, కరీంనగర్, కొమురంభీం, మంచిర్యాల, ఆదిలాబాద్, జనగామ, వరంగల్, నిజామాబాద్, కామారెడ్డి, సిద్దిపేట, మెదక్ జిల్లాలతో పాటు తెలంగాణ జిల్లాల్లోని ప్రతి ప్రాంతంలోనూ శివపార్వతులుగా మారిన స్త్రీ, పురుషులు, పిల్లలు సైతం తరలివస్తారు. ఆడ, మగ తేడా లేకుండా శివపార్వతులుగా మారుతున్న తీరును తగ్గించడానికి చేస్తున్న ప్రయత్నాలు కొంతమేరకు ఫలితాలు ఇస్తున్నాయి.

● పెళ్లిల పునరుద్ధరణ..

శ్రీరామనవమి రోజున ఆలయ ప్రాంగణంలో జరిగే కల్యాణం వేళ వీరు ఎక్కడ ఉన్నా వేములవాడకు వచ్చి శివుడితో వివాహం చేసుకున్నట్లు పెళ్లి తంతును నిర్వహిస్తారు. ప్రతిఏటా శ్రీరామ నవమి రోజు లక్షల మంది శివపార్వతులు తమ పెళ్లిలను పునరుద్ధరించుకుంటారు. సీతారాముల కల్యాణం జరుగుతుండగా జంగమయ్య ఆధ్వర్యంలో పెళ్లి తంతు నిర్వహించుకుంటారు. కొత్త బట్టలు ధరించి, నుదుట పెద్ద బొట్టు, బాసికాలు, తలపై జీలకర్ర, బెల్లం, చేతిలో త్రిశూలం ధరించి జోలె పట్టుకొని అక్షింతలు పట్టుకొని దేవునితో తమ వివాహం చేసుకుంటారు. తాహతు మేరకు కట్నాలు కూడా చదివిస్తారు. పెళ్లిలు చేసుకొని పిల్లాపాపలతో కుటుంబ జీవనం గడుపుతూనే శివపార్వతులుగా మారిన వారు కూడా ఉంటారు. అనారోగ్యానికి గురైనప్పుడు దేవుడికి మొక్కుగా మారిన తదనంతర కాలంలో శివపార్వతులుగా మారిపోతున్నట్లు వారు చెబుతుంటారు.

వేములవాడ దేవస్థానంలో జరిగే ఈ శివపార్వతుల పెళ్లి తంతును జంగాలుగా పరిగణింపబడే వీర శైవులు నిర్వహిస్తారు. శివపార్వతిగా మారేవారికి జంగమయ్యనే మెడలో రాగి మంగళ సూత్రం, కాళ్లకు రాగి మట్టెలు తొడిగి స్త్రీ, పురుష భేదం లేకుండా చీర కటిస్తారు. చేతికి త్రిశూలాన్ని ఇచ్చి శివుడితో పెళ్లి జరిపిస్తారు. దీంతో ఆయా స్త్రీ, పురుషులు శివ పార్వతులుగా మారినట్లు భావిస్తారు. ఆనాటి నుంచి వారు ఆది భిక్షువుగా చెప్పుకునే శివుడి అడుగుజాడల్లో నడుస్తూ భిక్షాటన చేస్తారు. ఒకసారి శివుడితో పెళ్లి చేసుకున్న తరువాత శివుడి భార్యగానే కొనసాగుతారు. ఆర్థికంగా, సామాజికంగా మెరుగైన స్థితిలో ఉన్న వారు తమ మామూలు జీవితంలో పెళ్లిలు చేసుకొని సంసారాలు చేస్తూనే శివపార్వతులుగా కొనసాగుతున్న వారు ఉన్నారు. వీరు ప్రతియేటా శ్రీరామనవమికి వేములవాడ స్వామి వద్దకు వచ్చి పెళ్లిని పునరుద్ధరించుకుంటారు. శివపార్వతులు పెళ్లిలు చేసుకొని పిల్లాపాపలతో కుటుంబ జీవనం గడుపుతూనే శివున్ని పెళ్లాడుతూ ఉంటారు. ఈ మధ్య కాలంలో హిజ్రాలు ఎక్కువ సంఖ్యలో శ్రీరామ నవమి రోజు వేములవాడకు రావడం కూడా కొన్ని సందర్భాల్లో వివాదాస్పదంగా మారుతోంది. శివపార్వతులు వేములవాడ ఆలయ ప్రత్యేకతను చాటుతూ ధార్మిక ప్రచారకులుగా కూడా ఎనలేని సేవలను అందిస్తున్నారు.

యువత క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి

ముస్తాబాద్ (గంభీరావుపేట), ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : యువత చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ వెంకటస్వామి అన్నారు. ముస్తాబాద్ మండలం చిప్పలపల్లిలో డార్క్ టు లైట్ ఎన్‌జీవో ఆధ్వర్యంలో విలేజ్ టు విలేజ్ క్రికెట్ టోర్నమెంటును శనివారం వెంకటస్వామి ప్రారంభించారు. యువత మొబైల్ ఫోన్‌లోని ఆన్‌లైన్ గేమ్‌లకు దూరంగా ఉండి, క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలన్నారు. క్రీడలతో మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉంటారని సూచించారు. డార్క్ టూ లైట్ ఎన్‌జీవో ద్వారా అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్న తిరుపతిని వెంకటస్వామి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజర్లు విజయ్, సంపత్, అబ్బు, రాజు, సాయి తదితరులు ఉన్నారు.

రైతులకు పూర్తి స్థాయిలో రుణమాఫీ చేయాలి

చందుర్తి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : రైతులకు పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయాలని రైతు సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు చిలక పెంటయ్య అన్నారు. మండల కేంద్రంలో మండల రైతు సంక్షేమ సంఘం కార్యవర్గ సభ్యుల సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వమని చెప్పుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన నిలబెట్టుకోకుండా రైతులను నట్టేట ముంచిందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఒక ఎకరానా 15000 రైతుబంధు ఇస్తామని ఇప్పటికీ పూర్తి చేయలేదన్నారు. చందుర్తి మండల పరిధిలో రెండు లక్షల రుణాలు దాదాపు 450 మందికి బ్యాంకు లోను రైతులకు మాఫీ కాలేదన్నారు. ఈ సమావేశంలో మండల రైతు సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి సంటి బాపురావు, మండల రైతు నాయకులు దుమ్మ ఆనంద్, నల్మాస్ రవీందర్ రెడ్డి, రమేష్ రావు, దుద్దిల లచ్చిరెడ్డి, కొమ్ము శంకర్, మర్రి రాజు,ఏరెడ్డి రాజిరెడ్డి, లక్కర్సు మహేష్, సుద్దాల నర్సయ్య, లక్కర్సు రాజేశం పాల్గొన్నారు.

కార్మికులకు మెరుగైన వేతనాలు అందించాలి



ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న కార్మికులు

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : మరమగ్గాలతోపాటు అనుబంధ రంగాల కార్మికులకు వేతనాలను నిర్ణయించి సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేష్, జిల్లా అధ్యక్షుడు కోడం రమణలు డిమాండ్ చేశారు. సిరిసిల్లలో మరమగ్గాలతోపాటు అనుబంధ రంగాల కార్మికులు సీఐటీయూ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరవధిక సమ్మె శనివారం ఐదో రోజుకు చేరుకుంది. ఇందులో భాగంగా పట్టణంలో బీవైనగర్‌లోని అమృత్‌లాల్ శుక్లా కార్మిక భవనం నుంచి గోపాల్‌నగర్ చౌరస్తా వరకు కార్మికులు ర్యాలీగా తరలివచ్చి ప్లకార్డులతో నిరసనలు తెలిపారు. సమ్మె డిమాండ్‌ల పరిష్కారం కోసం సోమవారం సిరిసిల్లలో 24 గంటల నిరాహారదీక్ష చేపడుతామని, ఈ కార్యక్రమానికి సీఐటీయూ పవర్‌లూం వర్కర్స్ యూనియర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూరపాటి రమేష్ హాజరవుతారని, మరమగ్గాలతోపాటు అనుబంధ రంగాలైన వార్పిన్, వైపని కార్మికులు పాల్గొన్ని విజయవంతం చేయాలని కోరారు. జిల్లా ఉపాధ్యక్షుడు నక్క దేవదాస్, వార్పిన్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు సిరిమల్ల సత్యం, వైపని వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు కుమ్మరికుంట కిషన్, నాయకులు ఉడుత రవి, ఒగ్గు గణేష్, ఎలిగేటి శ్రీనివాస్, సబ్బని చంద్ర కాంత్, బాస శ్రీధర్, వేణు, తిరుపతి, రాజు, రాము, వెంకటేశ్వర్లు, సదానందం తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సబ్ స్టేషన్ మంజూరుపై సంబరాలు



సంబరాల్లో పాల్గొన్న గ్రామస్థులు

చందుర్తి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండలం లింగంపేట గ్రామానికి విద్యుత్ సబ్‌స్టేషన్ మంజూరుచేయడంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్ చిత్రపటానికి గ్రామ కాంగ్రెస్ నాయకులు శనివారం క్షీరాభిషేకం చేసి సంబరాలు జరుపుకున్నారు. కాంగ్రెస్ నాయకుడు బండారు శేఖర్ మాట్లాడుతూ గ్రామంలో రూపాయలు 3కోట్ల 52 లక్షలతో విద్యుత్ లోవోల్టేజీ సమస్య పరిష్కారం కోసం సబ్ స్టేషన్ మంజూరు చేయడంతో పాటు సీసీ రోడ్లకు, పలువురికి సిఎం ఆర్‌ఎఫ్ నిధులు మంజూరు చేయడం పట్ల ఎమ్మెల్యే శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ నాయకులు ఇందూరి రాజిరెడ్డి,రాజు తర్రే వినోద్, గణేష్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

బాబు జగ్జీవన్‌రామ్ ఆశయ సాధనకు కృషి

- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా - ఘనంగా నివాళులర్పించిన అధికారులు, నాయకులు



సిరిసిల్లలో పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ఎస్పీ మహేష్ బి గీతే, కేక్ కట్ చేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

సిరిసిల్ల, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): మాజీ ఉప ప్రధాని, బాబు జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను అధికారికంగా శనివారం రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో, వివిధ పార్టీల ఆధ్వర్యంలో బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు తెలిపారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఎస్సీ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి, బాబు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ఎస్పీ మహేష్ బి గీతే, గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ వెల్ముల స్వరూపరెడ్డి, అధికారులు, ప్రజాప్రతినిధులు పూలమాలలు వేశారు. కేక్ కట్ చేసి స్వీట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా మాట్లాడుతూ బాబు జగ్జీవన్‌రామ్ ఆశయ సాధనకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలన్నారు. ప్రతి ఒక్కరూ ఆయన చూపిన బాటలో పయనించాలని అన్నారు. జిల్లా కలెక్టరేట్‌లో బాబు జగ్జీవన్‌రాం చిత్రపటానికి అధికారులు పూలమాలలు వేసి నివాళులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో వినోద్‌కుమార్, కమిషనర్ సమ్మయ్య, ఎస్సీ అభివృద్ధి అధికారి రాజమనోహర్‌రావు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ స్వప్న, ఉద్యానవన శాఖ అధికారి లత, షెడ్యూల్ కులాల సహాయ అధికారి విజయలక్ష్మీ, అంబేద్కర్ సంఘాల ప్రతినిధులు కత్తెర దేవదాస్, రాగుల రాములు, అవునూరి వెంకట్రాజం, కంసాల మల్లేశం, లింగంపల్లి సత్యనారాయణ, సెస్ డైరెక్టర్ కొట్టెపల్లి సుధాకర్, కాంగ్రెస్ మహిళ అధ్యక్షురాలు వనిత, తదితరులు పాల్గొన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యాలయంలో బాబు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి చైర్మన్ సత్యనారాయణ పూలమాలలు వేసి నివాళులు తెలిపారు.

వివిధ పార్టీల ఆధ్వర్యంలో...

రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో వివిధ పార్టీల ఆధ్వర్యంలో భారత మాజీ ఉపప్రధాని బాబు జగ్జీవన్‌రాం జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సిరిసిల్ల గాంధీచౌక్ వద్ద బాబు జగ్జీవన్‌రాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు తెలిపారు. కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు అకునూరి బాలరాజు, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ వెల్ముల స్వరూప రెడ్డి, కాంగ్రెస్ మహిళ అధ్యక్షురాలు కాముని వనిత, కాంగ్రెస్ నాయకులు వైద్య శివప్రసాద్, మ్యాన ప్రసాద్, కమలాకర్‌రావు, రవి, తదితరులు పాల్గొన్నారు. బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో బాబు జగ్జీవన్‌రాం చిత్రపటానికి బీఆర్ఎస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులు తెలిపారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట అగయ్య, పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, మహిళ అధ్యక్షురాలు వనజ, బీఆర్ఎస్ నాయకులు రాఘవరెడ్డి, లింగంపల్లి సత్యనారాయణ, మల్లారెడ్డి, అగ్గిరాములు, జక్కుల యాదగిరి, బండ నర్సయ్య, మాట్ల మధు, వెంకటరాములు, తదితరులు నివాళులు తెలిపారు.



గాంధీచౌక్ వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



బీఆర్ఎస్ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న నాయకులు

క్రీడా రంగానికి మరింత ప్రోత్సాహం..

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



విజేతగా జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎస్పీ మహేష్ బి గీతే

వేములవాడ, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : క్రీడారంగానికి ప్రజా ప్రభుత్వం మరింత ప్రోత్సాహం అందిస్తుందని వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాజన్న ప్రీమియం లీగ్ క్రికెట్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమం శనివారం వేములవాడలోని బాలానగర్ మైదానంలో జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ క్రీడల నిర్వహణ వల్ల మానసిక ఉల్లాసంతో పాటు శారీరక ధారుఢ్యం పెంపొందుతుందన్నారు. వేములవాడ ప్రాంతంలో మినీ స్టేడియం పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని, మర్రిపల్లి ప్రాంతంలో ఐదు ఎకరాల స్థలంలో క్రీడా మైదానం ఏర్పాటు త్వరలో ఆచరణలోకి వస్తుందన్నారు. ఎస్పీ మహేష్ బి గితే మాట్లాడుతూ నిత్యం బిజీగా ఉండే డాక్టర్లు, లాయర్లు, ఉపాధ్యాయులు, పోలీసులు, పాత్రికేయులు, లయన్స్ క్లబ్ సభ్యులు అంతా ఒక చోట కలిసి క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో వేములవాడ ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్ శ్రీనివాస్, మహిళా విభాగం అధ్యక్షురాలు డాక్టర్ లీలా శిరీష, ఉపాధ్యక్షుడు డాక్టర్ చీకోటి సంతోష్ కుమార్, కార్యదర్శి డాక్టర్ అభినయ్, సీనియర్ వైద్యులు డాక్టర్ సత్యనారాయణ స్వామి, డాక్టర్ మనోహర్, డాక్టర్ ఎం ఆనందరెడ్డి, డాక్టర్ ఎస్ పద్మలత, డాక్టర్ శోభారాణి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గుడిసె సదానందం, గవర్నమెంట్ లీడర్ బొడ్డు ప్రశాంత్, వేములవాడ పట్టణ సీఐ వీరప్రసాద్, రూరల్ సీఐ శ్రీనివాస్, చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు, ఆయా జట్ల కెప్టెన్లు, క్రీడాకారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

అనంతరం విజేతలకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎస్పీ మహేష్ బి గితే ట్రోఫీలు, క్రీడాకారులకు జ్ఞాపికలు అందజేశారు. టోర్నమెంట్ విజేతగా నిలిచిన పోలీసు అధికారులతో కూడిన రక్షక్ రేంజర్స్ జట్టును ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

సేంద్రియ సాగు శిక్షణకు ఇటిక్యాల రైతు



శాస్త్రవేత్తతో రైతు రాజేందర్‌రెడ్డి

రాయికల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): రాజస్థాన్‌లో జరుగుతున్న సేంద్రియ సాగు శిక్షణకు రాయికల్ మండలం ఇటిక్యాల గ్రామానికిచెందిన రైతు గడ్డం రాజేందర్ రెడ్డిని ఎంపిక చేయగా మౌంట్ అబులో శిక్షణ పొందుతున్నాడు. ఈసందర్భంగా రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ సేంద్రియ సాగులో మెళకువలు నేర్పిస్తున్నారని తెలిపాడు. తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో అగ్రికల్చర్ టెక్నాలజీ మేనేజ్‌మెంట్ ఏజెన్సీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాలకు హాజరైనట్లు పేర్కొన్నారు.

అందని బిల్లులు...ఆగిన పనులు

- ఏళ్లుగా ముందుకు సాగని నిర్మాణ పనులు

గంగాధర, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమం కోసం చేపట్టిన అభివృద్ధి పనులు అధికారుల నిర్లక్ష్యంగా ఏళ్లుగా ముందుకు సాగడంలేదు. చేసిన పనులకు బిల్లులు రాక కాంట్రాక్టర్లు పనులు వదిలేయడంతో అసంపూర్తిగా ఉన్న భవనాలు దర్శనమిస్తున్నాయి. గంగాధర మండలంలోని లక్ష్మీదేవి



లక్ష్మీదేవిపల్లిలో పాఠశాల భవనం

పల్లిలో పాఠశాల భవనానికి గత ప్రభుత్వం మూడు లక్షల రూపా యలు మంజూరు చేసింది. స్లాబు పూర్తి చేసి లోపల ఒక వైపు గో డలు, ఫ్లోరింగ్ పనులు పూర్త య్యాయి. 2.65 లక్షల బిల్లు మంజూ రైంది. మిగతా బిల్లులు రాకపోవ డంతో కాంట్రాక్టర్ పనులు నిలిపి వేశాడు. ప్రహరీ, లోపల గోడలు నిర్మించాలి. మిగులు పనులకు 2.25 లక్షలు మంజూరైనట్లు సమాచారం. పాఠశాల పనులు పూర్తి చేసి వచ్చే విద్యా సంవత్సరం నుండైనా వినియోగంలోకి తీసుకు రావాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

- అద్దె భవనంలో పల్లె దవాఖాన

మండలంలోని కురిక్యాల పల్లె దవాఖాన అద్దె భవనంలో అసౌకర్యాల మధ్య కొనసాగుతోంది. సొంతభవన నిర్మాణానికి నాలుగేళ్ల క్రితం 21 లక్షల నిధులు



కురిక్యాలలో అసంపూర్తిగా ఉన్న పల్లె దవాఖాన భవనం

మంజూరయ్యాయి. స్లాబు వేసిన కాంట్రాక్టర్ బిల్లులు రాక మధ్యలో వదిలేశాడు.

- ఇదే గ్రామంలోని పాఠశాలకు మన ఊరు మనబడి పథకం కింద 14 లక్షల రూపాయలు మంజూరయ్యాయి.ది. ఈ నిధులతో కిచెన్ షెడ్డు, టాయిలెట్లు నిర్మించాలని నిర్ణయించారు. నిధులు సరిపోక కిచెన్‌కు పిల్లర్లు వేసి వదిలేశారు. అసంపూర్తిగా నిలిచిపోయిన పనులకు నిధులు విడుదల చేసి వినియోగంలోకి తీసుకురావాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

నంబర్‌ప్లేట్ లేని 14 బైక్‌లు సీజ్



వాహనదారులతో మాట్లాడుతున్న ఎస్సై రవి

శంకరపట్నం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కేశవపట్నంలో నంబర్‌ప్లేట్ లేని వాహనాలు, మైనర్‌డ్రైవింగ్‌పై పోలీసులు శనివారం ప్రత్యేక తనిఖీ నిర్వహించారు. ఈసందర్భంగా నంబర్‌ప్లేట్ లేని 14ద్విచక్ర వాహనాలను స్టేషన్‌కు తరలించి సీజ్‌చేసినట్లు ఎస్‌ఐ కొత్తపల్లి రవి తెలిపారు.

వ్యక్తి అదృశ్యం.. కేసు నమోదు



సంపత్ కుమార్

జమ్మికుంట, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట మున్సిపల్‌పరిధిలోని పాత వ్యవసాయ మార్కెట్ ప్రాంతానికిచెందిన భూపతి సంపత్ కుమార్ కనపడటం లేదని అతడి భార్య హేమ ఫిర్యాదు మేరకు పోలీస్‌లు కేసు నమోదు చేశారు. పోలీస్‌లు తెలిపినవివరాల ప్రకారం.. సంపత్ కుమార్ పదిసంవత్సరాలుగా ఆర్థిక ఇబ్బందులతో సతమతం అవుతున్నాడు. తరుచూ ఇంట్లో ఆర్థిక పరిస్థితి చెప్పుకుంటూ బాధపడేవాడు. ఈనెల 5న ఉదయం 10.30గంటల ప్రాంతంలో ఇంట్లో నుండి బయటకు వెళ్లాడు. సాయంత్రం వరకు ఇంటికి తిరిగిరాలేదు. కుటుంబ సభ్యులు ఎంతవెతికినా ఫలితం లేకుండా పోయింది. ఫోన్‌కూడా స్విచ్ఛాఫ్ రావడంతో సంపత్‌కుమార్ భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణసీఐ వరంగంటి రవికుమార్ తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

ధర్మపురి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి గోదావరి నదిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని ధర్మపురి పోలీసులు శనివారం కనుగొన్నారు. నదిలోగల బండరాళ్ల కింద మృతదేహం కుళ్లిపోయి ఉంది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

గంజాయి పట్టివేత

జగిత్యాలరూరల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణంలోని టీఆర్ నగర్ కాలనీకి చెందిన షేక్‌నజీర్ అనేవ్యక్తి నుంచి 131గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు జగిత్యాలరూరల్ ఎస్సై సధాకర్ తెలిపారు. జగిత్యాల మండలం ధరూర్‌శివారులో పోలీసులు శనివారం తనిఖీలు నిర్వహిస్తుండగా నజీర్ అనే వ్యక్తి వద్ద గంజాయి లభ్యమైంది. దీంతో గంజాయిని స్వాధీనం చేసుకొని నజీర్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మానవాళికి శ్రీరాముడి జీవితం ఆదర్శం

కోల్‌సిటీటౌన్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): మానవాళికి శ్రీరాముని జీవితం ఆదర్శమని విశ్వహిందూ పరిషత్ భాగ్యనగర్ క్షేత్ర సంఘటన కార్యదర్శి గుమ్ముల సత్యం అన్నారు. విశ్వహిందూ పరిషత్ గోదావరిఖని శాఖ ఆధ్వర్యంలో శనివారం కోదండ రామాలయంలో జరిగిన శ్రీరామోత్సవంలో ఆయన ప్రసంగించారు. యువత సన్మార్గంలో నడవాలని, చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ శ్రీరాముని అడుగుజాడల్లో నడవాలన్నారు. నేటి యువతరం శ్రీరామ రాజ్యాన్ని నిర్మించాలని నాదేశం-నాధర్మం అనే నినాదంతో యువతీ యువకులు ముందుకు సాగాలన్నారు. సమాజంలో మాతృమూర్తుల పాత్ర ఎంతో ముఖ్యమన్నారు. విభాగ్ కార్యదర్శి అయోధ్య రవీందర్, గోరక్ష ప్రముఖ్ ఇసంపెల్లి వెంకన్న, జిల్లా కార్యదర్శి నాగులమల్యాల సత్యం, నగర కార్యదర్శి మ్యాడగోని రవీందర్, కొండపర్తి లింగన్న, మునిగాల సంపత్, అడిగొప్పుల రాజు, ములుకుంట్ల శ్రీనివాస్, పిన్నింటి శ్రీనివాస్, పారిపల్లి చక్రపాణి, అరవింద్, కోట తిరుమల, సూర్యదేవర జ్యోతి, లలితమ్మ, స్వప్న, మమత, స్వరూప, పాల్గొన్నారు.

రెండు బైకులు ఢీ: ఇద్దరికి గాయాలు

శంకరపట్నం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం తాడికల్ శివారులో రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొన్న సంఘటనలో ఇద్దరు గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తాడికల్ గ్రామానికి చెందిన రాగుల శ్రీనివాసచారి కరీంనగర్ నుంచి తాడికల్ వస్తున్నాడు. తాడికల్ గ్రామశివారులోని రైస్‌మిల్లుల వద్ద ఒడిస్సాకు చెందిన డీబీఎల్ కంపెనీలో పనిచేసే కృష్ణ ఎదురెదురుగా రావడంతో రెండుబైక్‌లు ఢీకొన్నాయి. ఈ ఘటనలో శ్రీనివాసచారికి, కృష్ణకు గాయాలు కావడంతో స్థానికులు 108లో హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

మృతుడి వివరాలు తెలిస్తే సమాచారం ఇవ్వాలి



ప్రమాదంలో మృతిచెందిన వ్యక్తి(ఫైల్)

హుజూరాబాద్‌రూరల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సింగాపూర్ గ్రామంలో కరీంనగర్-వరంగల్ ప్రధానరహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ గుర్తుతెలియని యువకుడు మృతిచెందాడు. మృతిచెందిన యువకుడి ఫొటోను సీసీ ఫుటేజీ ఆధారంగా శనివారం టౌన్‌సీఐ తిరుమల్‌గౌడ్ విడుదల చేశారు. పోలీసుల వద్ద ఉన్న సమాచారం మేరకు మృతిచెందిన వ్యక్తి రాకేష్ అయి ఉంటాడని భావిస్తున్నామని హుజూరాబాద్ ప్రాంతానికి ఎందుకు వచ్చాడో తెలియడం లేదన్నారు. ఫొటోలో ఉన్న వ్యక్తిని గుర్తిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

సమాజంలో న్యాయవాద వృత్తి మహోన్నతమైనది



మానవ హక్కుల కమిషన్ మాజీచైర్మన్ జస్టిస్ చంద్రయ్యకు పుష్పగుచ్ఛం అందిస్తున్న జడ్జి దుర్గేష్

సుల్తానాబాద్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): సమాజంతో ఉత్పన్నమయ్యే అనేక సమస్యలకు పరిష్కారాన్ని చూపించే న్యాయవాద వృత్తి మహోన్నతమైనదని హైకోర్టు మాజీ న్యాయమూర్తి, రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ మాజీ చైర్మన్ జస్టీస్ చంద్రయ్య అన్నారు. శనివారం సుల్తానాబాద్ కోర్టును సందర్శించిన ఆయన బార్ అసోసియేషన్‌లో న్యాయవాదులతో మాట్లాడారు. రాజ్యాంగం కల్పించిన హక్కులు, బాధ్యతలను సమాజంలో అమలుపరచని సందర్భాలలో వాటిని సవ్యమైన మార్గంలో నడిపించేందుకు న్యాయవాదులు సేవ చేయాలని అన్నారు. న్యాయవాదులకు చట్టాలు, రాజ్యాంగ హక్కులు పట్ల అవగాహన కల్పించారు. కాగా జస్టీస్ చంద్రయ్యకు సుల్తానాబాద్ కోర్టు జడ్జి దుర్గం గణేష్ పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికి సన్మానించారు. బార్ అధ్యక్షులు తిరుపతి రెడ్డి,న్యాయవాదులు కలసి జస్టీస్ చంద్రయ్య ను ఘనంగా సన్మానించారు. బార్ ప్రధాన కార్యదర్శి బోయిని భూమయ్య, సీనియర్ న్యాయవాదులు ఆవుల లక్ష్మీరాజంయాదవ్, పబ్బతి లక్ష్మీకాంతరెడ్డి, బాలకిషన్ ప్రసాద్,మాడూరి అంజనేయులు, జోగుల రమేష్, సామల రాజేంద్ర ప్రసాద్, ఆవుల శివకృష్ణ, గుడ్ల వెంకటేశ్, బిబ్బిలి శ్యామ్, కరుణాకర్, లెక్కల గంగాధర్, తిరుపతి, సారయ్య తదితరులు పాల్గొన్నారు.

వంగిన విద్యుత్ స్తంభం.. పొంచి ఉన్న ప్రమాదం

పెద్దపల్లి రూరల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్ద బొంకూరు గ్రామంలో విద్యుత్‌స్తంభంతో ప్రమాదం పొంచి ఉంది. పలు వీధుల్లో విద్యుత్‌స్తంభాలు పూర్తిగా ఇళ్లపైకి ఒరిగినా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈదురుగాలులు వస్తే ఇంటిపై స్తంభంకూలితే భారీప్రమాదం చోటు చేసుకుం టుందని ప్రజలు పేర్కొంటున్నారు. అధికారులు స్పందించి గ్రామంలోని ఇళ్లపై ఒరిగిన విద్యుత్‌స్తంభాలను సరిచేసి, ప్రాణ నష్టం జరగకుండా చూడాలని గ్రామస్థులు కోరుతున్నారు.



పెద్దబొంకూరులో ఇళ్లపైకి ఒరిగిన విద్యుత్ స్థంభం

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

శంకరపట్నం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం ఆము దాలపల్లి శివారులో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పంచాయతీ కార్య దర్శి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులుతెలిపిన వివరాల ప్రకారం.. మండ లంలోని కన్నాపూర్ గ్రామపంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న రాజేష్ విధులు ముగించుకొని స్వగ్రామమైన జమ్మికుంటకు ద్విచక్ర వాహ నంపై వెళ్తున్నాడు. ఆముదాలపల్లి శివారులోని సబ్‌స్టేషన్ వద్ద రోడ్డుపై పడి పోయి ఉండగా, అటుగా వెళ్తున్న రైతులు గమనించి రోడ్డు పక్కకు తీసుకెళ్లి 108కుసమాచారం అందించారు. చికిత్సనిమిత్తం 108లో ఆస్పత్రికి తరలిం చారు. కాగా ఈప్రమాదానికి సంబంధించి పూర్తివివరాలు తెలియాల్సి ఉంది.

స్వాతంత్ర్య సమరయోధుడు కాంతారావుకు కన్నీటి వీడ్కోలు



పాడె మోస్తున్న సీపీఐ నాయకులు

ఎలిగేడు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు తెలంగాణ సాయుధపోరాటవీరుడు(సీపీఐ) సుల్తాన్‌పూర్ మాజీసర్పంచ్ తానిపర్తి కాంతారావుకు ప్రజలు, నాయకులు కన్నీటి వీడ్కోలు పలికారు. శుక్రవారం ఆయన మృతిచెందగా శనివారం సుల్తాన్‌పూర్‌లో అంత్యక్రియలు నిర్వహించారు. అధికారులు, ప్రజాసంఘాలు, కమ్యూనిస్టు నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొని నిజాంకు వ్యతిరేకంగా జరిగినఉద్యమంలో చురుకుగా పాల్గొన్నట్లు స్థానికులు పేర్కొన్నారు. 30ఏళ్లపాటు సర్పంచ్‌గాపనిచేసి ప్రజలకు విశేషసేవలు అందించారు. ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు, మాజీఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డిలు కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆర్‌డివో గంగయ్య, డిప్యూటీ తహసీల్దార్ కిరణ్‌కుమార్, ఆర్‌ఐశేఖర్‌లు కాంతారావు పార్థివ దేహంపై జాతీయ జెండాను కప్పి నివాళులర్పించారు. సీపీఐ కార్యదర్శులు తాండ్రసదానందం, మర్రివెంకటస్వామి అంత్యక్రియల్లో పాల్గొని ఎర్ర జెండాను కప్పారు. అనంతరం అంతిమయాత్రలో పాల్గొని పాడేమోశారు. మాజీ ఎంపీపీ తానిపర్తి స్రవంతిమోహన్‌రావు, మాజీ సర్పంచ్ అర్షనపల్లి వెంకటేశ్వర్‌రావు, కుటుంబ సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

అదుపు తప్పిన కారు

- నలుగురికి గాయాలు



ప్రమాదానికి గురైన కారు

మహాముత్తారం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): కారు అదుపు తప్పడంతో నలుగురికి గాయాలైన సంఘటన మండలంలో శనివారం చోటుచేసుకుంది. పెద్దపల్లి జిల్లా గోదవరిఖనికి చెందిన బోగిరి విజయ్‌కుమార్, ఎం అశోక్, శేఖర్, రాంరెడ్డి మహాముత్తారం మండలం మీదుగా ములుగు జిల్లా మేడారం వెళ్తుండగా యామన్‌పల్లి సమీపంలో ఈ ఘటన జరిగింది. కారు అదుపుతప్పి రోడ్డు కిందకు దూసుకెళ్లింది. దీంతో కారు ధ్వంసమై నలుగురికి గాయాలయ్యాయి. వీరిలో ఒకరు స్వల్పంగానూ, ముగ్గురు తీవ్రంగానూ గాయపడినట్టు తెలిసింది. క్షతగాత్రులను 108 సిబ్బంది భూపాలపల్లి ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై విచారణ చేస్తున్నట్లు ఎస్సై మహేంద్ర కుమార్ తెలిపారు.

మట్టి కుండ పోయి ప్లాస్టిక్ బిందె వచ్చె!



ఈత చెట్లకు కట్టిన ప్లాస్టిక్ బిందెలు

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): కల్లు గీసి నిల్వ చేయడం కోసం గతంలో గీత కార్మికులు లొట్టిలు(కుండలు) వినియోగించేవారు. కులవృత్తులకు ఆదరణ తగ్గడంతో కుమ్మరులు కుండలు చేయడం మానేశారు. గ్రామీణ ప్రాంతాల్లో కుండలు అందుబాటులో లభించకపోవడం, కోతుల బెడద అధికమవడంతో ఈత చెట్ల నుంచి కల్లు తీసేందుకు గీత కార్మికులు లొట్టిల(కుండలు)కు బదులు ప్లాస్టిక్ బిందెలను వాడుతున్నారు. ఎల్లారెడ్డిపేట గ్రామ శివారులోని ఈత చెట్లకు ఇలా ప్లాస్టిక్ బిందెలను కట్టి కల్లును సేకరిస్తున్నారు. ప్లాస్టిక్ బిందెలు వాడడం వల్ల కోతులు అటు ఇటు తీసేసిన కింద పడి పగిలిపోకుండా ఉంటుందని గీత కార్మికులు పేర్కొంటున్నారు.

ప్రజా ధర్నా పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ/రామగిరి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 8న హైద్రాబాద్‌లో నిర్వహించనున్న ప్రజాధర్నా పోస్టర్లను శనివారం యైటింక్లయిన్‌కాలనీ, రామగిరి ఆర్జీ-3 డివిజన్ పరిధిలోని సెంటినరీకాలనీ ఐఎఫ్‌టీయూ ఆఫీస్‌లలో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు ఆవిష్కరించారు. డివిజన్ కార్యదర్శి బీ అశోక్ మాట్లాడారు. ఛత్తీస్‌గఢ్‌లో కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరిట హత్యాకాండను సృష్టిస్తున్నాయన్నారు. వందలాది మందిని ఎన్‌కౌంటర్ల పేరిట బలి తీసుకుంటున్నారని, అడవుల్లోని అపార ఖనిజ సంపదను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టే కుట్రలో భాగంగానే కగార్ పేరిట హత్యాకాండ సాగిస్తున్నాయని అశోక్ పేర్కొన్నారు. మేధావులు, విద్యార్థి యువజన సంఘాలు కేంద్ర వైఖరిని ఖండించాలని కోరారు. ఆపరేషన్ కగార్‌కు వ్యతిరేకంగా ఈనెల 8న హైద్రాబాద్ ఇందిరా పార్క్ వద్ద నిర్వహించే ప్రజాదర్బార్‌కు కార్మికులు, ప్రజలు తరలిరావాలని అశోక్ పిలుపునిచ్చారు.

మధ్య మానేరు నిర్వాసితులను.. గుండెల్లో పెట్టుకుంది కాంగ్రెస్ ప్రభుత్వమే

- వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



రుద్రవరంలో ఉపాధిహామీ పథకాన్ని ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ టౌన్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): మధ్యమానేరు నిర్వాసితులను గుండెల్లో పెట్టుకుని చూసుకుంది కాంగ్రెస్ ప్రభుత్వమేనని ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ మండలంలోని ఆరెపల్లి, నంకెపల్లి, అనుపురం, చింతలఠాణ, చీర్లవంచ, కొడుముంజ, శాభాష్‌పల్లి, గుర్రంవానిపల్లి గ్రామాల ప్రజలకు ఉపాధిహామీ పథకాన్ని రుద్రవరంలో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ వేములవాడ మండలంలోని నిర్వాసితుల సమస్యలు దగ్గరుండి చూశానని, వారిత్యాగం మరువలేనిదన్నారు. నిర్వాసితులకు ఉపాధికల్పనే లక్ష్యంగా నిరంతరం కృషి చేస్తున్నానని గుర్తుచేశారు. 9గ్రామాల్లో 3500 మంది ఉపాధిహామీ నిర్వాసిత కూలీలకు 100 రోజులు పని కల్పిస్తున్నామన్నారు. ఒక్క రోజు పనికి రూ.300పైచిలుకు చెల్లిస్తున్నామని, జాబ్‌కార్డు లేని వారికి జాబ్ కార్డులు అందించి పని కల్పిస్తామన్నారు. ఉపాధిహామీ పనికి వెళ్లడం ద్వారా ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికికూడా అర్హులు అవుతారని సూచించారు. ప్రజలందరు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రుద్రవరం గ్రామానికి నూతనంగా సబ్‌స్టేషన్ మంజూరైందని, త్వరలోనే పనులు ప్రారంభిస్తామన్నారు. రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రైసింగ్ తెలంగాణగా ముందుకుపోతుందన్నారు.

కార్యక్రమంలో ఎంపిడీవో మల్హోత్ర, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పిల్లి కనుకయ్య, చింతపల్లి శ్రీనివాస్‌రావు, ఎర్రం రాజు, గాలిపెల్లి స్వామి ఉన్నారు.

ఆలయాలు మానవతా వికాస కేంద్రాలు



మాట్లాడుతున్న ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి

కరీంనగర్ కల్చరల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): దేవాలయాలు మానవతా వికాసకేంద్రాలుగా విలసిల్లుతున్నాయని, ప్రజలకు సేవలందించే విధంగా మనపూర్వీకులు ఆలయాలను రూపొందించారని జాతీయ సాహిత్యపరిషత్ పూర్వ జాతీయఅధ్యక్షుడు ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. జాతీయ సాహిత్యపరిషత్ కరీంనగర్ జిల్లాశాఖ ఆధ్వర్యంలో శనివారం కొత్తపల్లి చిన్నగుట్టపై స్వయంభూ వేంకటేశ్వరాలయంలో కవిసమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాట్లాడారు. దేవాలయాలు ఆధ్యాత్మికతతోపాటు అన్న సత్రాలుగా, అనాథాశ్రమాలుగా, ధర్మ సత్రాలుగా, విద్యా, వైద్య, వేద, కళా, సాంస్కృతిక కేంద్రాలుగా వర్ధిల్లుతున్నాయన్నారు. పరిషత్ అధ్యక్షుడు గాజుల రవీందర్, డాక్టర్ గంద్ర లక్ష్మణరావు, ప్రజ్ఞాభారతి చైర్మన్ డాక్టర్ లెక్కల రాజభాస్కర రెడ్డి, పరిషత్‌తెలంగాణ అధ్యక్షుడు వడ్లూరి ఆంజనేయరాజు. నరహరి నారాయణరెడ్డి, బండ గోపాల్‌రెడ్డి, కొత్తపల్లి మాజీ సర్పంచ్ వాసాల రమేశ్, సంస్థ ప్రధానకార్యదర్శి నంది శ్రీనివాస్, డాక్టర్ కలువకుంట రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



పాల్గొన్న రచయిత్రులు

ధర్మపురి నుంచి పట్టువస్త్రాలు.. తలంబ్రాలు



ధర్మపురి ఆలయం నుంచి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు తీసుకువస్తున్న ఆలయ ఈవో, ధర్మకర్తలు

ఇల్లందకుంట/ధర్మపురి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ఇల్లందకుంట శ్రీ సీతారామ చంద్రస్వామి ఆలయానికి ధర్మపురి లక్ష్మీనృసింహస్వామి ఆలయ ఈవో శ్రీనివాస్ పట్టువస్త్రాలు.. ముత్యాల తలంబ్రాలు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఈవో శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈఏడాది కూడా స్వామివారి కల్యాణం సందర్భంగా పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు అందజేశామన్నారు. అనంతరం ఆయనను స్థానిక ఈవో, ఆలయ అర్చకులు శాలువాతో సన్మానించి, స్వామివారి చిత్రపటాన్ని బహూకరించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో సుధాకర్, ధర్మపురి ఆలయ కమిటీ చైర్మన్ జక్కు రవీందర్, ధర్మకర్తలు పాల్గొన్నారు.

ఆల్ ఇండియా హాకీ పోలీస్ మీట్‌కు ఎంపిక



వినీత్

హుజూరాబాద్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణానికి చెందిన మోటపోతుల వినీత్ ఈ నెల7 నుంచి 14 వరకు ఒడిషాలోని భువనేశ్వర్‌లో జరిగే 73వ ఆల్ ఇండియా హాకీ పోలీస్‌మీట్‌కు ఎంపికయ్యాడు. వినీత్ హైదరాబాద్‌లోని అంబర్‌పేట్‌లో సిటీ పోలీస్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. వినీత్ ఎంపికపై హాకీ క్లబ్ అధ్యక్షుడు తోట రాజేంద్రప్రసాద్, శ్రీనివాస్, శంకర్, ఉమామహేశ్వర్, సజ్జు, యూసుఫ్, రమేష్, తిరుపతి హర్షం వ్యక్తం చేశారు.

నేడే రామయ్య కల్యాణమహోత్సవం

● హాజరుకానున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



కల్యాణానికి ఏర్పాటు చేసిన బారీకేడ్లు

వేములవాడ కల్చరల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజన్న సన్నిధిలో రామయ్య దివ్య కల్యాణ మహోత్సవం ఆదివారం కన్నుల పండుగగా నిర్వహించేందుకు ఈవో వినోద్‌రెడ్డి ఆధ్వర్యంలో అధికారులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. రాజన్న ఆలయంలో నిర్వహించే శ్రీసీతారామచంద్రుల కల్యాణాన్ని తిలకించేందుకు రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో వేములవాడకు తరలిరానున్నట్లు ఆలయాధికారులు అంచనా వేస్తున్నారు. ఆదివారం ఉదయం 11.55 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు శ్రీస్వామివారి కల్యాణతంతు నిర్వహించనున్నారు. సాయంత్ర 5 గంటలకు శ్రీస్వామివారి రథోత్సవం, రాత్రి 7.30 గంటలకు డోలోత్సవము ఘనంగా నిర్వహించనున్నారు. రాజన్న ఆలయానికి సుమారుగా 50 వేల వరకు భక్తులు తరలి రానున్నారని, దానికి అనుగుణంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి ఆధ్వర్యంలో సీఐ వీరప్రసాద్ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. రాజన్న ఆలయంలోని ఈవో కార్యాలయం ముందు ప్రత్యేక కల్యాణ మండపం పైన శ్రీస్వామి వారి కల్యాణాన్ని జరిపించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. రాములోరి కల్యాణాన్ని వీక్షించేందుకు భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు బారీకేడ్స్‌తో గ్యాలరీలను ఏర్పాటు చేసి ఇబ్బందులు లేకుండా పోలీస్ సిబ్బంది, ఆలయ



కల్యాణవేదిక ఏర్పాట్లు

ఉద్యోగులు, సిబ్బందిని ఏర్పాటు చేస్తున్నారు. ఆదివారం నిర్వహించే శ్రీసీతారామచంద్రుల కల్యాణ మహోత్సవానికి వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరుకానున్నట్లు ఆలయ ఈవో తెలిపారు.

● భక్తులు ఇబ్బందులు లేకుండా చర్యలు..

శ్రీసీతారాముల కల్యాణాన్ని వేములవాడ రాజన్న ఆలయంలో అంగరంగ వైభవోపేతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఈవో వినోద్‌రెడ్డి తెలిపారు. రాజన్న ఆలయానికి భారీగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉందని, భక్తులను దృష్టిలో పెట్టుకుని భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. భక్తులకు ఉచిత భోజన వసతిని, వేసవి కాలం కావడంతో చల్లని తాగునీరు. మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

రాజన్న ఆలయంలో కొనసాగుతున్న వేడుకలు

● ప్రత్యేక పూజలు నిర్వహించిన అర్చకులు
● రాజన్న సేవలో పలువురు ప్రముఖులు

వేములవాడ కల్చరల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారి ఆలయంలో శ్రీరామనవరాత్రోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా శనివారం రాజన్న ఆలయంలో స్వామి వారితో పాటుగా శ్రీసీతారామచంద్రస్వామి, శ్రీఅనంతపద్మనాభస్వామి అనుబంధ పరివార దేవతామూర్తులకు అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీస్వామి వార్లకు భక్తోత్సవము, హవనములు కార్యక్రమాలను ఘనంగా చేపట్టారు.

● దర్శించుకున్న ప్రముఖులు..

వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి వారిని దర్శించుకునేందుకు సిద్దిపేట జిల్లా జడ్జి సాయిరమాదేవి, ఎండోమెంట్ అడిషనల్ కమిషనర్ కే. జ్యోతి వేములవాడకు వచ్చారు. రాజన్న ఆలయానికి విచ్చేసిన వారికి ఆలయ అర్చకులు స్వస్తి వేదోక్త స్వాగతం పలికారు. శ్రీరాజరాజేశ్వర స్వామివారి దర్శనం అనంతరం అర్చకులు ఆశీర్వచనం



ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు

ఇవ్వగా ఈవో వినోద్‌రెడ్డి రాజన్న ప్రసాదాన్ని అందజేశారు. వెంట ఏఈవోలు బ్రహ్మన్నగారి శ్రీనివాస్, అశోక్‌కుమార్, సూపరింటెండెంట్ శ్రీనివాస్, శ్రీకాంచారి, రాజేందర్ తదితరులు ఉన్నారు.

● రాజన్న గోశాల, అన్నదాన ట్రస్ట్‌కు విరాళం

వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి గోశాలకు, అన్నదాన ట్రస్ట్‌కు హైద్రాబాద్ నగరానికి చెందిన మదికంటి సృజన్ - స్వాతి దంపతులు విరాళం ఆలయ ఈవో వినోద్‌రెడ్డికి అందజేశారు. రాజన్న ఆలయ గోశాలకు రూ. ఒక లక్ష, అన్నదాన ట్రస్ట్‌కు రూ.1.50 లక్షలు, శ్రీస్వామివారికి రూ.63 వేలు 638 విరాళంగా చెక్కు రూపంలో అందించారు. వారి వెంట ఆలయ అకౌంటెంట్ ఆగంరావు ఉన్నారు.

వేములవాడలో సందడి

● కల్యాణానికి తరలివచ్చిన భక్తులు



రాజన్న ఆలయం వద్ద ఆటపాటలు

వేములవాడ కల్చరల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): రాజన్న ఆలయంలో ఆదివారం నిర్వహించే శ్రీసీతారాముల కల్యాణ మహోత్సవానికి వేములవాడకు భక్తులు భారీ సంఖ్యలో తరలి వస్తున్నారు. శనివారం సాయంత్రం నుంచి రాజన్న ఆలయానికి భక్తుల రాక ఒక్కసారిగా పెరిగింది. రాత్రి 7 గంటల వరకు రాజన్న ఆలయ ప్రాంగణంతో పాటుగా ఆలయ పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి. శ్రీసీతారాముల కల్యాణాన్ని పురస్కరించుకుని రాజన్న ఆలయానికి జోగినీలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. రాజన్న ఆలయం ముందు జోగినీలు బతుకమ్మ పాటలు పాడుతూ నృత్యాలు చేయడంతో ఆలయ పరిసరాలు సందడిగా మారాయి. భారీగా భక్తులు తరలిరావడంతో ఆలయ ఓపెన్‌స్లాబ్‌లో జడల రమేష్ ఏర్పాటు చేసిన భక్తి సంగీతం ఆకట్టుకుంది. ఇదిలా ఉండగా భారీ సంఖ్యలో భక్తులు తరలిరావడంతో పలు విభాగాలను ఆలయ ఈవో వినోద్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. కల్యాణం ఏర్పాట్లను పరిశీలించి ఉద్యోగులకు సూచనలు చేశారు.



ఆలయం ఎదుట బతుకమ్మ ఆడుతున్న మహిళలు, జోగినులు

రాజన్న ఆలయ అన్నదాన ట్రస్టుకు విరాళం

వేములవాడ కల్చరల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజ్యేశ్వర స్వామివారి అన్నదాన ట్రస్ట్‌కు వేములవాడ మండలం చింతలఠాణ గ్రామానికి చెందిన నిమిశకవి శ్రీకాంత్ స్రవంతి దంపతులు విరాళం అందజేశారు. శనివారం కుటుంబ సమేతంగా రాజన్నను దర్శించుకున్న అనంతరం అన్నదాన ట్రస్టుకు రూ. లక్ష, 41 వేయి 116లు ఏఈవో జయకుమారికి అందజేశారు.

ఘనంగా రేణుక ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠ



పూజలు చేస్తున్న అర్చకుడు

కళ్యాణ్‌నగర్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి వద్ద శనివారం రేణుక ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన ఘనంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణ మధ్య విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ మేరుగు హన్మంతు గౌడ్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు హోమాలు, చండీయాగాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయంలో నిత్య పూజలను నిర్వహిస్తామన్నారు. శనివారం చండీయాగాన్ని నిర్వహించి భక్తులకు అన్నప్రసాదం అందజేశారు. ఆలయ కార్యవర్గ సభ్యులు మోడెం సురేందర్, బాలసాని స్వామిగౌడ్, వంగ శ్రీనివాస్, పొన్నం అంజయ్య, జనార్ధన్(లడ్డు), కోడూరి రవి, మేరుగు యాదగిరిగౌడ్, అశోక్, సాయిలీల సురేష్, రాయమల్లుగౌడ్ పాల్గొన్నారు.

బంగారం తరలింపు వ్యవహారంలో ఇద్దరి అరెస్టు

● మరో ఇద్దరి కోసం గాలింపు ● వేములవాడ ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి



వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి, సీఐ వీరప్రసాద్

వేములవాడ, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : సౌదీ అరేబియా నుంచి తీసుకువచ్చిన బంగారాన్ని మాయం చేసిన ఘటనకు సంబంధించి ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు వేములవాడ ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి తెలిపారు. వేములవాడ పట్టణ పోలీస్‌స్టేషన్లో శనివారం రాత్రి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ ఘటనకు సంబంధించిన వివరాలను ఆమె వెల్లడించారు. జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండల కేంద్రానికి చెందిన రుద్ర రాంప్రసాద్ అనే వ్యక్తి సౌదీ అరేబియాలో ఉన్న తన సమీప బంధువు రవీందర్ ద్వారా 400 గ్రాముల బంగారాన్ని తెప్పించుకునేందుకు 35 లక్షల రూపాయలు పంపించాడు. దీంతో రవీందర్ బంగారం ఇండియాకు పంపించే ప్రయత్నాలలో భాగంగా వేములవాడకు చెందిన కాల్వ వెంకటేష్ అనే వ్యక్తి ద్వారా చందుర్తి మండలం జోగాపూర్ గ్రామానికి చెందిన తొంటి బీరయ్య, గడ్డం అనిల్ ఇండియా వెళుతున్నారని తెలుసుకొని వీరి ద్వారా 400 గ్రాముల బంగారం పంపించాడు. సౌదీ నుంచి బయలుదేరుతున్న సమయంలో తాము పెద్ద మొత్తంలో బంగారం ఇండియాకు తీసుకువస్తున్న విషయాన్ని తమ సమీప బంధువు ఏనుగుల నాగరాజుకు సమాచారం ఇవ్వడంతో ఈ మొత్తం బంగారాన్ని కాజేయాలని పథకం పన్నారు. హైదరాబాదులోని విమానాశ్రయంలో దిగిన వెంటనే అక్కడకు చేరుకున్న నాగరాజుకు బంగారం ఇవ్వడంతో అతను అక్కడి నుంచి వెళ్లిపోయి మొబైల్ ఫోన్ స్విచ్ ఆఫ్ చేశాడని ఏఎస్పీ వివరించారు. సౌదీ నుంచి తీసుకువచ్చిన బంగారాన్ని రాంప్రసాద్‌కు అప్పగించాల్సిన బీరయ్య, అనిల్ అందుకు బదులుగా నాగరాజుకు అప్పగించిన విషయం తెలుసుకున్న రాంప్రసాద్ తాను మోసపోయినట్లు ఫిర్యాదు చేశారని, ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని వెల్లడించారు. ఈ సంఘటనలో బీరయ్య, అనిల్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని, కాల్వ వెంకటేష్, ఏనుగుల నాగరాజు పరారీలో ఉన్నారని ఆమె వివరించారు. పరారీలో ఉన్న వారిని పట్టుకునేందుకు ఇద్దరు ఎస్ఐలతో కూడిన ఆరుగురు సభ్యుల బృందాన్ని ఏర్పాటుచేసి గాలింపు చేపట్టామని, విమానాశ్రయంలో కస్టమ్స్ అధికారుల కన్ను కప్పి పెద్ద మొత్తంలో బంగారం తీసుకువచ్చిన వ్యవహారం వెనుక ఎవరున్నారనే కోణంలో దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. త్వరలోనే మిగిలిన నిందితులను పట్టుకుని బంగారం స్వాధీనం చేసుకుంటామని స్పష్టం చేశారు. పట్టణ సీఐ వీరప్రసాద్ ఈ సమావేశంలో పాల్గొన్నారు.

బాలుడి వీరంగం

వేములవాడ, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : వేములవాడ పట్టణంలోని గాంధీనగర్‌లో ఓ బాలుడు వీరంగం సృష్టించాడు. మత్తు పదార్థాలకు అలవాటు పడి శనివారం ఇంట్లో ఉన్న తన సోదరిని చితకబాదగా మందలించిన తల్లిపై బండరాయితో దాడి చేసేందుకు యత్నించడంతో స్థానికులు అడ్డుకున్నారు. స్థానికులు ఆ బాలుడిని ఇంట్లో బంధించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడకు చేరుకొని 100 వాహనంలో ఆసుపత్రికి తరలించారు.

కొండగట్టులో భక్తుల సందడి



కొండగట్టులో ఆలయం వద్ద భక్తులు



జయంతి కోసం కొండగట్టులో ఏర్పాటు చేసిన బారీకేడ్లు

మల్యాల, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధానం శనివారం భక్తులతో సందడిగా మారింది. వేకువజాము నుంచే వేలాదిగా వచ్చిన భక్తులు, దీక్షాపరులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో అభిషేక పూజలు, సత్యనారాయణ వ్రతాలు చేశారు. అనంతరం బేతాళుడు, శ్రీరాముని ఆలయంలో పూజలు చేశారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఈవో శ్రీకాంత్‌రావు, పర్యవేక్షకులు హరిహరనాథ్, సునీల్, చంద్రశేఖర్ పర్యవేక్షించారు.

● నేడు శ్రీరామనవమి వేడుకలు

కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయంలో శ్రీరామనవమి సందర్భంగా సీతారాముల కల్యాణం నిర్వహించడానికి దేవస్థానం తరపున ఏర్పాట్లు చేశారు. ప్రత్యేక వేదికపై రాములోరి కల్యాణం వేడుకగా జరుపనున్నారు.

చిన్న హనుమాన్ జయంతికి ఏర్పాట్లు

కొండగట్టులో జరిగే చిన్న హనుమాన్ జయంతి ఉత్సవాలకు భక్తుల సౌకర్యార్థం పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. గతంలో సగానికి పైగా పొడగాటి కర్రలతో బారికేడ్లు, క్యూలైన్‌లు ఏర్పాటు చేయగా ఈసారి ఇనుప వాటితో ఆలయం ముందు, వెనుకాల ఏర్పాటు చేశారు. మరిన్నింటిని ఏర్పాటు చేయనున్నారు. ఈ సారి పోలీస్ అవుట్‌పోస్టు నుంచి కోనేరు వరకు ప్రత్యేక క్యూలైన్ ఏర్పాటు చేశారు.

వైభవంగా కుంకుమ పూజలు

పెగడపల్లి, ఏప్రిల్5 (ఆంధ్రజ్యోతి): పెగడపల్లి మండలంలోని నామాపూర్ సీతారామచంద్రస్వామి ఆలయంలో శనివారం కుంకుమ పూజలు వైభవంగా నిర్వహించారు. శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా శనివారం సుప్రభాత సేవ, పంచామృతాభిషేకములు, ప్రధాన కలశస్థాపన నిర్వహించి కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్న ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ వీరారెడ్డి, మాజీ సర్పంచ్ కరుణాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నామాపూర్‌లోని రామాలయంలో కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

ఎన్టీపీసీ రిటైర్డు ఉద్యోగులకు మెరుగైన పెన్షన్ పథకం అమలు



ఎన్టీపీసీ ఏజీఎం(హెచ్‌ఆర్) సిక్దర్‌ను అభినందిస్తున్న మాజీ ఉద్యోగులు

జ్యోతినగర్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ఎన్టీపీసీ రిటైర్డు ఉద్యోగులకు మెరుగైన పెన్షన్ పథకం అమలుకు మార్గం సుగమమైంది. గతంలో ఉన్న ఈపీఎస్-95 కింద కనిష్ఠ స్థాయిలో పెన్షన్ పొందిన రిటైర్డ్ ఉద్యోగులు ఇకముందు నిజవేతనాలపై(హయ్యర్ వేజెస్) ఈపీఎస్ 95 స్కీం కింద గరిష్ఠంగా పెన్షన్ పొందనున్నారు. రామగుండం ఎన్టీపీసీ మానవ వనరుల(హెచ్‌ఆర్) విభాగం అధికారులు చొరవతో కొత్త పెన్షన్ పథకానికి మోక్షం లభించింది. హయ్యర్ వేజెస్‌పై పెన్షన్ ఇవ్వాలని ఎన్టీపీసీ మాజీ ఉద్యోగులు న్యాయం పోరాటం చేశారు. గతంలో సుప్రీంకోర్టు నిజవేతనాలపై ఈపీఎస్ 95 పెన్షన్ స్కీంను రిటైర్డు ఉద్యోగులకు అమలు చేయాలని తీర్పు ఇచ్చింది. 01-09-2014 తరువాత పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు ఈ పథకం అమలు చేయాల్సి ఉంటుంది. రామగుండం ఎన్టీపీసీ హెచ్‌ఆర్ అధికారులు కరీంనగర్‌లోని పీఎఫ్(ఈపీఎఫ్‌వో) అధికారులతో ఈపీఎస్ 95పై సంప్రదింపులు జరిపారు. ఈ క్రమంలో సుమారు 398 మంది రిటైర్డు ఉద్యోగులకు కొత్త పెన్షన్ స్కీం అమలు కానుంది. మెరుగైన పెన్షన్ అమలయ్యేలా కృషి చేసిన హెచ్‌ఆర్ ఏజీఎం(హెచ్‌వోడీ) విజయ్ కుమార్ సిక్దర్, అధికారులను ఎన్టీపీసీ ఈడీ చందన్ కుమార్ సామంత అభినందించారు. హయ్యర్ వేజెస్‌పై ఈపీఎస్ 95 పెన్షన్ స్కీం అమలుకు కృషి చేసిన ఎన్టీపీసీ మానవ వనరుల అధికారులను రామగుండం ఎన్టీపీసీ రిటైర్డ్ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎ.రాంకిషన్, సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్టీసీ కార్మికులు సమ్మెకు సన్నద్ధం కావాలి

భగత్‌నగర్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో సమ్మె సైరన్ మోగించనున్నామని, కార్మికులందరూ సన్నద్ధం కావాలని తెలంగాణ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి, జేఏసీ వైస్ చైర్మన్ థామస్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం కరీంనగర్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం, యాజమాన్యం చర్యలతో ఆర్టీసీ మనుగడ ప్రశ్నార్థకంగా మారిందన్నారు. సోమవారం లేబర్ కమిషన్ కార్యాలయంలో సమ్మె తేదీని ప్రకటించనున్నట్లు చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేకుండా ఉద్యోగులను ఇబ్బందులకు గురి చేస్తోందన్నారు. ఉద్యోగులకు పదోన్నతులు, కొత్త నియామకాలు లేవన్నారు. ఉద్యోగుల పీఎఫ్ ట్రస్టులో ఉన్న డబ్బులను యాజమాన్యం వాడుకుందన్నారు. దీంతో ఉద్యోగులు పీఎఫ్ డబ్బులు తీసుకునే వీలు లేకుండా పోయిందన్నారు. గత సర్కార్ ఆర్టీసీని రాష్ట్ర ప్రభుత్వంలో విలీనం చేస్తామని అసెంబ్లీలో ప్రకటించిందని, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల్లో విలీనం అంశం ఉందని, ఇప్పుడు పట్టించుకోవడం లేదని అన్నారు. మహాలక్ష్మి పథకానికి తాము వ్యతిరేకం కాదని, ఆడబిడ్డలకు అండగా ఆర్టీసీ ఉద్యోగులు ఉంటారని, దానికనుగుణంగా బస్సుల



మాట్లాడుతున్న టీఎంయూ రాష్ట్ర కార్యదర్శి థామస్‌రెడ్డి

సంఖ్యను పెంచాలని కోరారు. ఈవీ బస్సులను తీసుకు వచ్చి డిపోలన్నింటినీ ప్రైవేట్ పరం చేయాలని చూస్తున్నారన్నారు. ఇప్పటికే కొన్ని డిపోలను ప్రైవేట్ పరం చేశారన్నారు. కేంద్రం ఎలక్ట్రిక్ బస్సులపై ఇస్తున్న సబ్సిడీని ప్రైవేట్ సంస్థలకు కాకుండా ఆర్టీసీకి వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. యూనియన్‌లు లేవని యాజమాన్యం ఉద్యోగులను ఇబ్బందులకు గురి చేస్తోందన్నారు. సమావేశంలో ఈబీ రావు, అంజిరెడ్డి, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

దళితబంధు నిధులు విడుదల చేయాలని ఆందోళన



కథలాపూర్‌లో సాధన సమితి సభ్యుల నిరసన

కథలాపూర్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో దళితబంధు కింద ఎంపికైన వారికి రెండో విడత నిధులు విడుదల చేయాలని శనివారం కథలాపూర్‌లోని అంబేద్కర్ విగ్రహం ఎదుట సాధన సమితి సభ్యులు ఆందోళన చేశారు. కలెక్టర్ల అకౌంట్లలో దళితబంధు నిధులు ఉన్నప్పటికీ ప్రభుత్వం ఎంపిక చేసిన వారికి లబ్ధి చేకూర్చడం లేదని ఆరోపించారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన అంబేద్కర్ అభయహస్తం పథకం వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సాధన సమితి అధ్యక్షుడు తీట్ల శంకర్, తరి రవి, తరి రమేశ్ తదితరులు ఉన్నారు.

న్యూస్ బాక్స్

కార్యవర్గం

గంభీరావుపేట, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని దోసలగూడెం కాలనీలో శనివారం అంబేడ్కర్ యువజన సంఘం నూతన కార్యవర్గం ఎన్నికైంది. అధ్యక్షుడిగా దోసల రామచంద్రం, ఉపాధ్యక్షుడిగా దోసల రాజనర్సు, ప్రధాన కార్యదర్శిగా టేకుమల్ల స్వామి, కోశాధికారిగా తోడేటి చంద్రం, సలహాదారులుగా బరిగెల రాజు, బరిగెల సురేష్, మద్దెల బాలరాజులు ఎన్నికయ్యారు. జై తెలంగాణ మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు దోసల చంద్రం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దోసల ఉపేంద్రల సమక్షంలో ఎన్నిక జరిగింది. ఈ క్యాక్రమంలో సంఘ నాయకులు దొసల శ్రీనివాస్‌రావు, బరిగెల జీవన్, బాబు, రఘు, శంకర్, నాంపెల్లి. ప్రేమ్ కుమార్, బాలరాజు, కిషన్, స్వామి. పర్శరాములు, చంద్రం, అనుజ్‌కుమార్, సతీష్ తదితరులు ఉన్నారు.

భయభ్రాంతులకు గురిచేస్తున్న వ్యక్తి అరెస్ట్

సిరిసిల్ల క్రైం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణంలో పెద్ద కత్తి పట్టుకొని ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న ఇప్పలపల్లి గ్రామానికి చెందిన సలేంద్రి రాకేశ్(26) అనే వ్యక్తిని శనివారం రాత్రి అరెస్ట్ చేశామని టౌన్ సీఐ కృష్ణ తెలిపారు. ఇతని వద్ద ఒక పెద్ద కత్తి, చిన్న బటన్ చాక్, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామని ఆయన తెలిపారు. కూలి పనిచేసుకుంటూ జీవించే రాకేశ్ తాగుడుకు బానిసై గతంలో వేములవాడలో దొంగతనాలకు పాల్పడగా జైలుకు వెళ్లి వచ్చాడని ఆయన తెలిపారు. మళ్లీ సిరిసిల్లలో తిరుగుతూ భయానక వాతావరణ సృష్టించాలనే ఉద్దేశ్యంతో కరీంనగర్‌లో పెద్ద కత్తి కొనుగోలు చేసి ద్విచక్ర వాహనంలో పెట్టుకొని తిరుగుతున్నాడన్నారు. ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాడని ఫిర్యాదు రావడంతో కేసు నమోదు చేసి అతడిని అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించామని ఆయన తెలిపారు.

ఘనంగా బాబు జగ్జీవన్‌రామ్ జయంతి..



సిరిసిల్ల సర్ధాపూర్ పోలీస్ బెటాలియన్‌లో..



చెక్కపల్లిలో..



ఎల్లారెడ్డిపేట మండలం దేవునిగుట్టతండాలో..



ఇల్లంతకుంటలో..

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : బాబూ జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలను సిరిసిల్ల అర్బన్ పరిధిలోని సర్ధాపూర్‌లోని 17వ పోలీస్ బెటాలియన్‌లో శనివారం అసిస్టెంట్‌కమాండెంట్ జె రాందాస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆర్‌ఐలు శంకర్, నారాయణ, నేమాజీ, శ్రీని వాస్, రఘునాథ్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

● ఎల్లారెడ్డిపేట : మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. రాచర్లగొల్లపల్లి, దేవునిగుట్టతండాలో జరుగుతున్న ఉపాధి పనుల వద్ద కూలీలు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్ కృష్ణహరి తదితరులు పాల్గొన్నారు.

● ఇల్లంతకుంట : మాజీ ఉపప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు మండలంలో ఘనంగా జరిగాయి. మండల పరిషత్ కార్యాలయం, పెద్దలింగాపూర్ గ్రామాల్లో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఫారూఖ్, ఎంపీడీవో శశికళ, సూపరింటెండెంట్ శ్రీనివాస్, డీటీ సత్యనారాయణ, మాజీ సర్పంచులు జితేందర్‌గౌడ్, పోతరాజు పర్శరాం, నాయకులు ప్రసాద్, భూమయ్య, పసుల వెంకటి, రాకేష్, రాజు, దేవదాస్, బాలరాజు, గన్నెరం నర్సయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

● గంభీరావుపేట : మండల పరిషత్, గ్రామపంచాయతీ కార్యాలయాల్లో వేడుకలు నిర్వహించారు. ఎంపీడీవో రాజేందర్, అం బేడ్కర్ సంఘాల మండల అధ్యక్షుడు ఎర్రోల్ల శంకర్, జిల్లా ఉపాధ్యక్షుడు ఇరిగి బాను, బీఆర్ఎస్ మండల మీడియా సెక్రె టరీ గ్యార దేవరాజు, ఎంఆర్‌పీఎస్ మండల ప్రధాన కార్యదర్శి నరేష్‌వర్మ, శ్రీహరి, ప్రవీన్, స్వామి తదితరులున్నారు.

● వేములవాడ రూరల్ : మండలంలో బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు జరిగాయి. చెక్కపల్లిలో జగ్జీవన్ రామ్ విగ్రహానికి ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పూలమాల వేసి నివాళులర్పించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వకుళాభరణం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

● రుద్రంగి : రుద్రంగి మండలం మానాల గ్రామంలోని గ్రామపంచాయతీ కార్యాలయాల్లో బాబు జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఏంపీవో సుధాకార్,నాయకులు జక్కు మోహన్, జక్కు వంశీ, రవీందర్, జక్కుల లక్ష్మినర్సయ్య, జలెంధర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

● చందుర్తి : మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో జయంతిని నిర్వహించారు. తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్ఐలు శ్రీనివాస్, మహేందర్, పంచాయతీ కార్యదర్శులు, అధికారులు పాల్గొన్నారు.

● వీర్నపల్లి : మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో వేడుకలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో తహసీల్దార్ ముక్తార్‌పాషా, ఎంపీడీవో అబ్దుల్ వాజిద్, నాయకులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

● కోనరావుపేట : మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో వేడుకలను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు గోపి మాట్లాడారు. గోపాడి సురేందర్‌రావు, మండల అధ్యక్షుడు మిర్యాల్‌కార్ బాలాజీ, నాయకులు పాల్గొన్నారు.

● కోనరావుపేట : కోనరావుపేట మండలం మంగళపల్లిలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో బాబు జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను నిర్వహించారు. కాంగ్రెస్ జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు జగన్మోహ న్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య, కాంగ్రెస్ నాయకులు, కోనరావుపేట మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ తాళ్లపల్లి ప్రభాకర్, మంగళపల్లి గ్రామశాఖ అధ్యక్షుడు బాదినేని బాలరా జు, అవురం సురేష్, ఉప్పుల పరుశరాములు, బాదనేని శేఖర్, ఉప్పుల శేఖర్, సాగర్ల రెడ్డి, సాసాల ఎర్రమల్లయ్య, పాల్గొన్నారు.

● వేములవాడ : బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలను వేములవాడలో బహుజన సేన రాజన్న సిరిసిల్ల ఆర్గనైజేషన్ అధ్యక్షుడు జింక శ్రీధర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ప్రధాన కార్యదర్శి లక్కే సాగర్, ఉపాధ్యక్షుడు సుంకరి శ్రీకాంత్, వేములవాడ మండల అధ్యక్షుడు నేదురి రాజు, జింక శ్రీకాంత్, ముద్రకోల గణేష్, నేదురి శ్రీకాంత్, అలువాల రాము, పొత్తూరి మనోహర్, లక్కే దినాకర్, మల్లారం హరీష్ పాల్గొన్నారు.

● ముస్తాబాద్, (గంభీరావుపేట) : ముస్తాబాద్‌లో బాబు జగ్జీవన్‌రాం జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ సురేష్, ఎంపీడీవో బీరయ్య, ఎస్ఐ గణేష్, ఎంఆర్‌పీఎస్ అధ్యక్షుడు రాజు, కాంగ్రెస్ అధ్యక్షుడు బాల్‌రెడ్డి, మాజీ సెస్ డైరెక్టర్ బాలయ్య, జిల్లా కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి శ్రీనివాస్, మాజీ సర్పంచ్ నర్సయ్య తదితరులు ఉన్నారు.



గంభీరావుపేటలో..



వీర్నపల్లిలో..



కోనరావుపేటలో..

సంక్షిప్త సమాచారం

చలివేంద్రం ప్రారంభం

ఇల్లంతకుంట, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రేపాక గ్రామంలో చలివేంద్రాన్ని శనివారం ప్రారంభించారు. బస్టాండ్ ప్రాంతంలో తాగునీరు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని గుర్తించిన యువకులు చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గుర్రం ప్రతాపరెడ్డి, హైమద్, వెగ్గళం సత్తయ్య, మైమూద్, రమేష్, సాదిక్, షాబీర్, శ్రీనివాస్, కుర్షిద్, రెహాన్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ సమావేశం

ఇల్లంతకుంట, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాళ్ళపెల్లి గ్రామంలో శనివారం సీపీఐ సమావేశం జరిగింది. సమావేశంలో సీపీఐ జిల్లా కమిటీ సభ్యుడు మంద సుదర్శన్, వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా అధ్యక్షుడు శ్రావణపెల్లి మల్లేశం, రాజు, శంకర్, ఎల్లయ్య, మల్లయ్య, నర్సయ్య, బాబు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

సిరిసిల్ల, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : పేదలకు సన్నబియ్యం అందించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి కృతజ్ఞతలు చెబుతూ సిరిసిల్లలో థ్యాంక్యూ సీఎం ప్రోగ్రాం నిర్వహించారు. శనివారం సిరిసిల్ల అంబేద్కర్‌చౌరస్తా వద్ద సిరిసిల్ల యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఆర్‌టీఏ సభ్యుడు సంగీతం శ్రీనాథ్, జిల్లా ప్రధాన కార్యదర్శి దామోదర్, నియోజవర్గం అధ్యక్షుడు చుక్క రాజశేఖర్, సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు దేవరాజ్‌రెడ్డి, ఎల్లారెడ్డిపేట అధ్యక్షుడు శివగౌడ్, తంగళ్లపల్లి అధ్యక్షుడు ఎగుర్ల ప్రశాంత్ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

గంభీరావుపేట, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : గంభీరావుపేట మండలం నాగంపేట గ్రామంలో శనివారం సీసీరోడ్డు నిర్మాణ పనులను బీజేపీ నేతలు భూమిపూజ చేసి ప్రారంభించారు. కేంద్ర హోంశా ఖ సహాయ మంత్రి బండి సంజయ్ సీసీ రోడ్డు కోసం రూ.5 లక్షలు మంజూరు చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు గంట అశోక్, దేవేందర్‌యాదవ్, రాజిరెడ్డి, కృష్ణకాంత్‌యాదవ్, విగ్నేష్‌గౌడ్, రవీందర్, శ్రీశైలం, మోహన్, రమేష్, దేవరాజు, చంద్రం, రాజు, ఎల్లం, సంతోష్ ఉన్నారు.

● కోనరావుపేట : కోనరావుపేట మండల కేంద్రంలో సీసీ రోడ్డు నిర్మాణానికి బిజెపి జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి శనివారం భూమి పూజ చేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు మిరియాల్‌కార్ బాలాజీ, గోపాడి సురేందర్‌రావు, భైరగోని సురేష్ గౌడ్, జింక వెంకటి, పాక మహేష్, నర్సయ్య, మాజీ సర్పంచ్ బాపురెడ్డి, జిల్లా అనిల్, సుధాకర్, రాజు, వంశీ, మోహన్, రాములు, మల్లేశం, బెంద్రం శ్రీనివాసరెడ్డి, దుర్గం తిరుపతి, అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లిలోని లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ నాయకులు శని వారం పంపిణీ చేశారు. శ్రీనివాస్‌రెడ్డి, సాహెబ్, నారాయణరెడ్డి, నారాయణ గౌడ్, బాబయ్య, స్కైలాప్‌రెడ్డి, పర్శరాములు, సాయి, బాబు పాల్గొన్నారు.

బాధిత సభ్యుడికి ఆర్థిక సాయం

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో పక్షవాతంతో బాధపడుతున్న తోటి సభ్యుడు శ్రీనివాస్‌కు లయన్స్ క్లబ్ సభ్యులు శనివారం అండగా నిలిచారు. రూ 20 వేల ఆర్థిక సాయం, రూ 6 వేల విలువైన వీల్ ఛైర్‌ను అందజేశారు. సభ్యులు సతీష్‌కుమార్, భాస్కర్‌రెడ్డి, రామచంద్రం, కిషన్, మల్లారెడ్డి, లక్ష్మారెడ్డి, రవీంందర్, ముత్యంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ దీక్షాపరుల శోభాయాత్ర

వేములవాడ కల్చరల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): వేములవాడ మున్సిపల్ పరిధి తిప్పాపూర్ గ్రామంలోని హనుమాన్ దేవాలయంలో శనివారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామానికి చెందిన హనుమాన్ దీక్షాపరులు స్వామివారి శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్‌లోని శ్రీ దాసాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో ఉదయం గణపతి, నవగ్రహా, అభిషేకం, హోమం తదితర కార్యక్రమాలను జరిపించారు. అంజనేయస్వామి మాలదారులు భక్తిశ్రద్ధల నడుమ భజనలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన యువకులకు సన్మానం

కోనరావుపేట, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : కోనరావుపేట మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన యువకులు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించగా వారిని గ్రామస్థులు శనివారం ఘనంగా సన్మానించారు. కొండాపూర్ గ్రామానికి చెందిన పోషవేణి అభినయ్ ఇండియన్ ఆర్మీకి, గొల్లపెల్లి వివేకవర్ధన్ గౌడ్ ఇండియన్ నేవీ ఉద్యోగాలకు ఎంపిక కాగా వారిని ఘనంగా సత్కరించారు.

మాజీ సైనికుడికి ఘన సన్మానం

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్ గ్రామానికి చెందిన మాజీ సైనికుడు పంతంగి రవిని ఆ గ్రామంలోని నారాయణపురం సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సన్మానించారు. దేశ సేవ కోసం చేసిన సేవలను కొనియాడారు. యువత రవిని ఆదర్శంగా తీసుకొని ఆ దిశగా పయనించాలని అన్నారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు నారాయణరెడ్డి, దేవిరెడ్డి, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

మహాత్ములు చూపిన మార్గంలో నడుద్దాం

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- పలు గ్రామాల్లో రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్రలు



వేములవాడలో పాదయాత్రలో పాల్గొన్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



ముస్తాబాద్‌లో పాదయాత్ర చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



సుద్దాలలో పాదయాత్ర చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

వేములవాడ, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : దేశానికి స్వాతంత్రం అందించిన మహాత్మా గాంధీ, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ అడుగుజాడల్లో నడుద్దామని వేములవాడ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకత్వం ఇచ్చిన పిలుపుమేరకు శనివారం వేములవాడలో జై బాపు, జై భీమ్, జై సంవిందాన్ పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కుల గణన కార్యక్రమాన్ని నిర్వహించడం ద్వారా దేశానికే రోల్ మోడల్ గా నిలిచిందన్నారు. కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్, పుల్కం రాజు తదితరులు పాల్గొన్నారు.



సనుగులలో పాదయాత్రలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

● గంభీరావుపేట : గంభీరావుపేట మండలం మల్లారెడ్డిపేట గ్రామం నుంచి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు హమీద్ ఆధ్వర్యంలో శనివారం రాజ్యంగ పరిరక్షణ పాదయాత్రను చేపట్టారు. మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మండ్లు, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు తిరుపతి, మార్కెట్ కమిటీ వైస్‌చెర్మన్ అంజిరెడ్డి, నాయకులు గౌరిశంకర్, రామచంద్రారెడ్డి, మల్యాల రాజవీర్, భూదయ్య, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

● ముస్తాబాద్: ముస్తాబాద్ మండలం మొర్రాయిపల్లిలో రాజ్యంగ పరిరక్షణ పాదయాత్రను మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో చేపట్టారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బాల్‌రెడ్డి, ఇన్‌చార్జీ నాగంకుమార్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● కోనరావుపేట : కోనరావుపేట మండలం మంగళపల్లి, సుద్దాల గ్రామాల్లో రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల కోఆర్డినేటర్ గడ్డం నర్సయ్య, కోనరావుపేట మార్కెట్ కమిటీ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు కేతిరెడ్డి జగన్మోహన్‌రెడ్డి, వైస్‌చైర్మన్ తాళ్లపల్లి ప్రభాకర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఫిరోజ్ పాషా, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు కాంగ్రెస్ నాయకులు నాయిని ప్రభాకర్‌రెడ్డి, సాసాల మల్లారెడ్డి, గొట్టే రుక్మిణి, పల్లె రవీందర్ రెడ్డి, బాదనేని బాలరాజు, అవురం సురేష్, మానక సత్యం, నాలుక సత్యం, కర్రోళ్ల భాస్కర్, నాగభూషణం, సిద్రవేణి ప్రభాకర్, బొడ్డు రమేష్, దొబ్బల దేవయ్య, నీరటి సంజీవ్, ఆగేష్, బుర్ర రవీందర్, అమృతరావు, పెంతల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

● చందుర్తి : చందుర్తి మండలం దేవునితండా సనుగుల, కిష్టంపేట, గ్రామాల్లో శనివారం జై బాబు, జై భీమ్, జై సంవిధాన్ పాదయాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. టీపీసీసీ సభ్యుడు సంగీతం శ్రీనివాస్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చింతపంటి రామస్వామి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బొజ్జ మల్లేశం, జవ్వాజి నాగరాజు, పోతుగంటి రంజిత్, ఏగోళం శ్రీనివాస్, అజ్మీర గణేష్, గొట్టే ప్రభాకర్, పులి సత్తయ్య పాల్గొన్నారు.

బీజేపీతోనే దేశ రక్షణ, అభివృద్ధి సాధ్యం..

వేములవాడ, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : భారతీయ జనతా పార్టీతోనే దేశ రక్షణ, అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని బిజెపి సీనియర్ నేత, ఉమ్మడి కరీంనగర్ జిల్లా మాజీ అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ అన్నారు. బీజేపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శనివారం పట్టణ శాఖ అధ్యక్షుడు రాపల్లి శ్రీధర్ నేతృత్వంలో వేములవాడలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతాప రామకృష్ణ మాట్లాడుతూ పార్టీ ఆవిర్భావ వేడుకలను ప్రతి కార్యకర్త ఘనంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. పట్టణ అధ్యక్షుడు రాపల్లి శ్రీధర్ మాట్లాడుతూ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రతి కార్యకర్త ఇంటిపైన పార్టీ జెండా ఎగరవేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రేగుల మల్లికార్జున్, జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షులు సంటి మహేష్, పిన్నింటి హనుమాండ్లు, సంటి అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.

● చందుర్తి ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని వేడుకల జిల్లా కన్వీనర్ సిరికొండ శ్రీనివాస్ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 6న నిర్వహించే పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయాలన్నారు. ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రతి కార్యకర్త ఇంటిపై బీజేపీ జెండా ఎగురవేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు మొకిలే విజేందర్, నాయకులు చిర్రం తిరుపతి, పెరుక గంగరాజు అంబాల శ్రీకాంత్, పత్తిపాక శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రతాప రామకృష్ణ

సన్నం బియ్యం పంపిణీ చేసిన బీజేపీ నాయకులు

రుద్రంగి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : రుద్రంగి మండల కేంద్రంలో బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో రేషన్ దుకాణాల్లో ప్రధానమంత్రి నరేంద్రమోదీ చిత్రపటాన్ని ఏర్పాటు చేసి లబ్ధిదారులకు సన్నం బియ్యాన్ని పార్టీ నాయకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధానమంత్రి గరీబ్ కళ్యాణ్ అన్న యోజనలో భాగంగా 90శాతం వాటా ఉన్నా రేషన్ బియాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్నట్లు చేప్పుకోవడం విడ్డురంగా ఉందన్నారు. దేశంలో కేంద్ర ప్రభుత్వం 80 కోట్ల మందికి ఉచితంగా రేషన్ బియ్యం అందస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు నంద్యాడపు వేంకటేష్, పడాల గణేష్, బోయిని రాజు, మీసాల రవిందర్, శ్రావణ్, రవీందర్, తదితరులు పాల్గోన్నారు.

9న బీజేపీ సర్కారు వైఖరిపై నిరసన..



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం చేస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 9వ తేదీన సిరిసిల్ల పట్టణంలో కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు అన్నారు. సిరిసిల్ల పట్టణంలోని సుభాష్‌నగర్‌లోని కార్మిక శాఖ భవనంలో శనివారం సీపీఐ జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వేణు మాట్లాడుతూ సీపీఐ జాతీయ కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా ఈ నెల 9, 10 తేదీలలో బీజేపీ సర్కారుపై దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టాలని ఇచ్చిన పిలుపు మేరకు సిరిసిల్ల పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో 9వ తేదీన ఉదయం 11 గంటలకు నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అలాగే సీపీఐ జాతీయ సమితిగా పేరు మారబోతుందని ఆయన వివరించారు.

ఈ సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు మంద సుదర్శన్, మీసం లక్ష్మణ్, లక్ష్మారెడ్డి, చంద్రం, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

సీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): శ్రీరామ నవమిని పురస్కరించుకుని ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లోని ఆలయాలు ముస్తాబయ్యాయి. రాచర్లగొల్లపల్లి, నారాయణపూర్ గ్రామాల్లోని సీతారామచంద్రస్వామి ఆలయాల్లో బ్రహోత్సవాలు శనివారం ప్రారంభయ్యాయి. రాచర్లగొల్లపల్లిలోని ఆలయంలో తోగుట పీఠాధిపతి మాధవనందసరస్వతి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకు ముందు విద్యాసాగర్‌శర్మ ఆధ్వర్యంలోని పురోహితులు సీతారామచంద్రస్వామి, వెంకటేశ్వరస్వామి, అంజనేయస్వామిలకు పంచామృతాభిషేకం, పార్వతిరాజరాజేశ్వరస్వామికి రుద్రాభిషేకం కార్యక్రమాలను నిర్వహించారు. మాధవనందసరస్వతి ప్రబోధనలు చేశారు. నారాయణపూర్‌లోని సీతారామచంద్రస్వామి ఆలయంలో ధ్వజారోహణం, అగ్నిప్రతిష్ఠ తదితర కార్యక్రమాలను నిర్వహించారు. ఈనెల 6న ఉదయం ప్రభాతసేవ, పూర్ణాహుతి, స్వామి వారి కల్యాణం, రథోత్సవం నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామని ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

తారురోడ్డును పూర్తి చేయండి

కోనరావుపేట, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : సుమారు మూడు కిలోమీటర్ల తారు రోడ్డు నిర్మించి మధ్యలో సుమారు 300 మీటర్ల మట్టి రోడ్డును వదిలేశారు. కోనరావుపేట మండలం అటవీ ప్రాంత గ్రామాలైన శివంగాలపల్లి నుంచి అక్కపెల్లి వరకు సుమారు మూడు కిలోమీటర్లు తారు రోడ్డు నిర్మాణం పూర్తి చేశారు. శివంగాలపల్లి గ్రామ శివారులో సుమారు 300 మీటర్లు తారు రోడ్డు నిర్మించకుండా వదిలేశారు. ఆ వదిలేసిన రోడ్డు ప్రాంతంలో వరద తాకిడికి రోడ్డు కొట్టుకుపోయి గుంతల మయంగా మారింది. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి మిగిలిన రోడ్డును తారు రోడ్డుగా నిర్మించి పూర్తి చేయాలని రెండు మండలాల వాసులు కోరుతున్నారు.